క్లుప్తంగా

ఉగ్రదాడిపై నిరసన ర్యాలీ



మధిర: పహల్గామ్ ఉగ్రవాద దాడిని నిరసిస్తూ మంగళవారం మధిర టీవీఎం పాఠశాల వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, భారత్ మాతాకీ జై, ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు లింగంపల్లి వెంకాయమ్మ ఉగ్రవాదాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు.

ధాన్యం కేంద్రంలో పరిశీలన

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సునీత ఎలిజబెత్ మంగళవారం పరిశీలించారు. కొనుగోళ్లతో పాటు ధాన్యం తరలింపులో జాప్యం చేస్తున్నారని అందిన ఫిర్యాదుతో ఆమె పరిశీలించి వివరాలు ఆరా తీశారు. టోకెన్లు వచ్చి వారం దాటినా లారీలు రాక ఇబ్బంది పడుతున్నామని రైతులు చెప్పారు. దీంతో త్వరగా వాహనాలు సమకూర్చి ధాన్యం తరలిస్తామని తహసీల్దార్ సూచించారు. మీగడ శ్రీనివాస్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



సత్తుపల్లి: ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ చూపిన గంగారం గ్రామానికి చెందిన గోళ్ల కళాధర్ కుమార్తె జ్యోతి అమూల్యను మమంగళవారం ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ ఆధ్వర్యాన సన్మానించారు. ఆమె వెయ్యి మార్కులకు గాను 993 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా మల్లూరు సత్యనారాయణ, సరాబు శివనాథ్ ప్రభు ఆధ్వర్యాన సన్మానించగా గోళ్ల ప్రసాద్, అడపా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

వైరా: సీఐటీయు అనుబంధ వైరా డివిజన్ ఆటో వర్కర్ల యూనియన్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. నాయకులు బుగ్గవరపు నాగేశ్వరరావు, పాలెం వెంకటకృష్ణారావు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించగా.. షేక్ నాగుల్‌మీరా 19 ఓట్ల మెజార్టీతో నాలుగోసారి యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నాయకులు షేక్ అఫ్జల్, సీహెచ్.కృష్ణయ్య, లక్ష్మణరావు, డి.రవి, పి.రాము, ఎస్.కే.అన్వర్, ఎస్.కే.సోందు, బాషా, సాయి, షరీఫ్, నాగులుమీరా, రాము తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంఈఓ మృతిపై సంతాపం



శేషభూషణం (ఫైల్)

తల్లాడ: రిటైర్డ్ ఎంఈఓ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బాజోజు శేషభూషణం(81) మృతి చెందారు. ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న ఆయన అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. ఆయన మృతికి సంతాపం తల్లాడలో బంగారం నగల షాపులు బంద్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు పైడిపల్లి శరత్ బాబు, కళ్యాణపు కృష్ణయ్య, సుబ్బయ్య, టి.వేణు, దగ్గుల రఘుపతిరెడ్డి, ఆవుల నరసయ్య, పి.సత్యనారాయణ, సూరి, చల్లా కృష్ణారావు, లక్ష్మయ్య, రామకృష్ణ, తిరుపతిరెడ్డి, నరేందర్‌రాజు, తిరుపతిరెడ్డి, పునాటి శేషగిరి, లూర్థురెడ్డి తదితరులు నివాళులర్పించారు.

లఘుచిత్రం షూటింగ్ పూర్తి

మధిర: మండలంలోని ఖాజీపురానికి చెందిన దర్శక, నటుడు ఏ.ఆర్.సమీర్ రచన, దర్శకత్వంలో ఆయనే హీరోగా నటిస్తూ ఏఎస్ఆర్ పిక్చర్స్, మన మధిర సినిమా బ్యానర్‌పై 'డైరెక్టర్ సాబ్.. ఏ.ఆర్.సమీర్ భాయ్' పేరుతో లఘుచిత్రం రూపొందించారు. మాటూరు గ్రామ పరిసర ప్రాంతంలో షూటింగ్ పూర్తిచేయగా ఇబ్రహీం, కరీం, రాజేష్ తదితరులు నటించారని సమీర్ వెల్లడించారు. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను జగన్నాధపురం వద్ద మంగళవారం సీజ్ చేశారు. ఇసుక తరలింపునకు అనుమతి తేలడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి, బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

దూషించిన ఘటనలో కేసు

మండలంలోని పందిళ్లపల్లికి చెందిన బాణాల గణేష్‌పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గ్రామస్తుడైన సింగారపు అప్పారావు సోమవారం రాత్రి కిరాణ షాప్ వద్దకు వెళ్లగా గణేష్ అసభ్య పదజాలంతో దూషిస్తూ కొట్టి చంపుతానని బెదిరించాడు. ఘటనపై అప్పారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మళ్లీ రుణాలు రానట్టేనా ?!



కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం కార్యాలయం

- రుణమాఫీ అవాంతరాలతో రైతులకు నిరాశ
- రెన్యూవల్ కాకపోతే వడ్డీ రాయితీ కష్టమే

కారేపల్లి: బ్యాంకుల్లో పంట రుణాల రెన్యూవల్స్‌కు రుణమాఫీ అడ్డంకిగా మారింది. రూ.2లక్షల మేర ఉన్న అందరి రుణాలు మాఫీ చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే ప్రకటించారు. అయితే చాలామందికి మాఫీ కాకపోవడంతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యాన వారు పాత రుణాలు చెల్లించేందుకు వెనకడుగు వేస్తుండగా.. కొత్త రుణాలు తీసుకోవడంతో అవాంతరాలు ఎదురయ్యే ప్రమాదం నెలకొంది.

స్పందన అంతంతే...

ఈ ఏడాది పంట రుణాల వసూళ్లకు వెళ్లిన బ్యాంకర్లు, సహకార సంఘాల బాధ్యులకు రైతుల నుంచి సరైన స్పందన రావడం లేదు. 'మాఫీ అవుతుంది, రుణాలు ఎందుకు చెల్లించాలి' అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. దీంతో సిబ్బంది నచ్చచెప్పినా ఫలితం లేక వెనుతిరుగుతున్నారు.



రుణాలు చెల్లించని రైతు భూమిలో జెండాలు పాతుతున్న సొసైటీ సిబ్బంది (ఫైల్)

వడ్డీతో సహా చెల్లిస్తేనే...

పంట రుణాలపై బ్యాంకులు, సహకార సంఘాలు ఏడు శాతం వడ్డీ విధిస్తాయి. ఈ వడ్డీ సక్రమంగా చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం మూడు శాతం రాయితీ ఇస్తుంది. ఈ నగదును బ్యాంకర్లు తిరిగి రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. కారేపల్లి సహకార సంఘంలో 60శాతం మంది రైతులు తమ పంట రుణాలను రెన్యూవల్ చేసుకోగా, వీరికి మాత్రమే 3శాతం వడ్డీ రాయితీ లభించనుంది. 2022–23 సంవత్సరానికి సొసైటీలో 900మందికి రూ.19.13లక్షలు, 2023–24లో 1,267 మందికి రూ.6.40లక్షలు రాయితీ అందింది. ఒకవేళ సమయానికి వడ్డీతో సహా రుణాలు చెల్లించకపోతే బకాయిపై బ్యాంకర్లు 14శాతం వడ్డీ విధిస్తారు. అంతేకాక వాయిదా మీరిన రుణాలపై రైతులకు నోటీసులు ఇచ్చి స్పందన రాకపోతే తనఖాలో ఉన్న ఆస్తులు జప్తు చేయనున్నారు.

అందరికీ మాఫీ చేస్తే బాగుండు



రూ.2లక్షల రుణమాఫీ కాకపోగా.. రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని సొసైటీ సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ చేస్తే బాగుండేది. రెన్యూవల్ చేయకపోతే 3శాతం వడ్డీ రాయితీ రాదని, 14శాతం విధిస్తామని బెదిరిస్తున్నారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలి.

– బందారు నాగేశ్వరరావు, తొడితలగూడెం

నోటీసులు ఇస్తాం అంటున్నారు



పంట రుణాలు రెన్యువల్ చేసుకోకపోతే నోటీసులు ఇస్తామని.. ఆపై తనఖా పెట్టిన భూములు వేలం వేస్తామని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం చెప్పినట్లుగా రుణమాఫీ చేయకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం రుణమాఫీ చేసి మాలాంటి రైతుల ఇబ్బందులు తీర్చాలి.

– బానోత్ కిషన్, గుంపెళ్లగూడెం

రెన్యూవల్ చేసుకోవాలి



రుణమాఫీతో సంబంధం లేకుండానే పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి. ప్రభుత్వం రుణమాఫీని 2023 డిసెంబర్ 9తేదీని కటాఫ్‌గా ప్రకటించింది. ఆతర్వాత రుణాలకు వడ్డీ రైతులే చెల్లించాలి. ఒకవేళ మాఫీ అయినా వడ్డీ మాఫీ ఉండదు. రెన్యూవల్ చేసుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు వస్తాయి.

– బి.హనుమంతరావు, కారేపల్లి సొసైటీ కార్యదర్శి

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి..

ఏన్కూరు: ఉద్యోగులకు పదవీ విరమణ సహజమేనని జెడ్పీ సీఈఓ దీక్షారైనా అన్నారు. ఎంపీడీఓ సకినాల రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఏర్పాటుచేసిన సభలో రమేష్‌ను దంపతులను సన్మానించాక ఆమె మాట్లాడారు. ఉద్యోగ విరమణ చేసిన వారు కుటుంబానికి సమయం కేటాయిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, డీఎల్‌పీఓలు రాంబాబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ రమేష్‌ను సన్మానిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్ష, తదితరులు

మే డే వేడుకలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న భారతి

సత్తుపల్లిటౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించనున్న మే డే వేడుకలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి పిలుపునిచ్చారు. సత్తుపల్లిలోని రావి వీరవెంకయ్య భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఆధునికీకరణ పేరుతో మార్చే ఆలోచనను కేంద్రప్రభుత్వం విరమించుకునేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మాదినేని రమేష్, శీలం సత్యనారాయణరెడ్డి, జాజిరి శ్రీను, కొలికపోగు సర్వేశ్వరరావు, తిరుపతిరావు, జగన్మోహనరావు, జాజిరి జ్యోతి, రావుల రాజబాబు, శీలం కరుణ, పాకలపాటి ఝాన్సీ, పుల్లయ్య పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో ఏఐటీయూసీ ఆధ్వర్యాన గురువారం మే డే వేడుకలు నిర్వహించనున్నట్లు నాయకులు సెంట్రల్ కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు నర్సింహారావు, సూర్యప్రకాష్, భీమయ్య, భరణి, వెంకటేశ్వర్లు, చారీ, శ్రీనివాస్, మధుబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

వైరా: జాతీయ స్థాయి బాలుర కబడ్డీ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టును ఇటీవల ఎంపిక చేశారు. ఈ జట్టులో వైరా న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థి ఎక్కిరాల వేణు అభినయ్‌కు స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం కరస్పాడెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ వేణు అభినయ్‌ను అభినందించారు. కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏఓ నర్సింహారావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేణు అభినయ్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మధిర: లేగ దూడలకు మొదటి మూడు రోజులు ముర్రుపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఉంటాయని పశు వైద్య శాఖ ఉద్యోగులు రఫీ అహ్మద్, లక్ష్మణరావు తెలిపారు. రాయపట్నం, రొంపిమల్ల గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలిగుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం లేగ దూడల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది కొండలరావు, కిరణ్, గోపాలమిత్ర పాల్గొన్నారు.

● **తల్లాడ:** మండలంలోని నూతనకల్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సత్తుపల్లి ఏరియా వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రదీఫ్‌కుమార్ పర్యవేక్షించగా, 889 గేదెలు, 26 ఆవులకు టీకాలు వేసినట్లు తెలిపారు. తల్లాడ పశువైద్యాధికారి అనస్ మదని, జేవీఓలు నాగరాజు, వరలక్ష్మి, డి.చొక్కారావు పాల్గొన్నారు.

● పేరుకే చలివేంద్రాలు

కొణిజర్ల మండలంలోని కొణిజర్ల, తనికెళ్ల, పల్లిపాడు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ఎవరికీ ఉపయోగపడడం లేదు. కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నెల క్రితం చలివేంద్రాన్ని ప్రారంభించి రెండు రోజుల పాటు కుండల్లో నీళ్లు పోశారు. ఆ తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో కుండలు దుమ్ము పట్టి అధ్వానంగా మారాయి. ఇక్కడ మండల పరిషత్, తహసీల్దార్, ఐకేపీ, ఈజీఎస్ కార్యాలయాలతో పాటు ఆధార్ సెంటర్ కూడా ఉండడంతో వచ్చే జనానికి నీరు దొరకక అల్లాడుతున్నారు. – కొణిజర్ల



దుమ్ము పట్టిన కుండలు

రేపటి నుంచి సమ్మర్ క్యాంప్

మధిర/ఏన్కూరు: మధిర ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి జూన్ 6వ తేదీ వరకు కబడ్డీ, బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వై.ప్రభాకర్ తెలిపారు. నిపుణులైన కోచ్‌ల ద్వారా శిక్షణ ఇవ్వనుండగా, పేర్ల నమోదుకు ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జ్ వై.చిన్ని (98491 25569)ని సంప్రదించాలని సూచించారు. అలాగే, ఏన్కూరు మండలం తిమ్మారావుపేట ఓం ఆదిత్య గాయత్రి పాఠశాలలో గురువారం నుంచి ఉచిత కబడ్డీ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓ రహీంబీ తెలిపారు. కబడ్డీతో పాటు స్పోర్ట్ స్కూళ్లలో ప్రవేశానికి బ్యాటరీ టెస్ట్ శిక్షణ కూడా ఉంటుందని వెల్లడించారు.

జిల్లా కమిటీలో స్థానం



మధిర: నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా కమిటీలో మధిర మండలం నుంచి పలువురికి స్థానం దక్కిందని జిల్లా గౌరవ సలహాదారులు లింగంపల్లి అప్పారావు తెలిపారు. ఖమ్మంలో మంగళవారం జిల్లా కమిటీని ఎన్నుకోగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మధిర మండలానికి చెందిన ఆలేటి సత్యనారాయణ రెండోసారి ఎన్నికయ్యారని పేర్కొన్నారు. అలాగే, గౌరవ సలహాదారులుగా లింగంపల్లి అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుండెమెడ వెంకటేశ్వరరావును ఎన్నుకున్నట్లు తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరించాలి

కల్లూరు: కల్లూరులో సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే పునరుద్ధరించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. కల్లూరులో కొన్నేళ్ల క్రితం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేయగా.. లైట్లు వెలగడం లేదని స్థానికులు పలువురు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో డీపీఓ మంగళవారం పరిశీలించి ఈఓ ఎస్.నాగేశ్వరరావుకు లైట్ల పునరుద్ధరణపై సూచనలు చేశారు. అలాగే, డివైడర్ల మధ్య స్తంభాలకు ఫ్లెక్సీలు, జెండాలను తొలగించి దిమ్మెలకు రంగులు వేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

'లయన్స్' ఆధ్వర్యాన ఇద్దరికి కుట్టుమిషన్లు



కుట్టుమిషన్లు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన వైరాకు చెందిన నిరుపేద మహిళలు వేమల వెంకటలక్ష్మి, పంతంగి మౌనికకు మంగళవారం కుట్టు మిషన్లు అందజేశారు. లయన్ లగడపాటి ప్రభాకర్‌రావు పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆర్థిక సాయంతో మిషన్లు అందజేసినట్లు బాధ్యులు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్‌తో పాటు చింతలపూడి వెంకటేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, ఉండ్రు వరలక్ష్మి, జి.కిషన్‌రాయ్, పుల్లారావు, రామకృష్ణ, రాంగోపాల్, చింతోజు నాగేశ్వరరావు, శ్రీను, రామారావు, రాజారావు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా భూభారతి చట్టం

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు: భూమి కలిగిన రైతులకు భూ భారతి చట్టం అండగా నిలుస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. కల్లూరులో మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి చట్టంతో రైతులు అవస్థలు పడ్డారని తెలిపారు. సన్న, చిన్న కారు రైతులు కోర్టులు, కలెక్టర్ల చుట్టూ తిరగలేక ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలన్నీ అధ్యయనం చేశాక ఎవరికీ ఇబ్బందులు ఎదురుకాకుండా తమ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈమేరకు రైతులు వారి సమస్యలపై దరఖాస్తులు ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఆర్డీఓ ఎల్.రాజేందర్ మాట్లాడుతూ భూ భారతిలో సమస్యల పరిష్కారం సులభంగా ఉంటుందని, రికార్డుల్లో తప్పుల సవరణ, సాదాబైనామాలు పరిష్కారం జరుగుతుందని తెలిపారు. తహసీల్దార్ పులి సాంబశివుడు, మార్కెట్ చైర్మన్ భాగం నీరజ, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పసుమర్తి చందర్‌రావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏనుగు సత్యంబాబు, తోటకూర శేషగిరిరావు, పెద్దబోయిన శ్రీను, లింగబోయిన పుల్లారావు, మాదాల వెంకటేశ్వరరావు, న్యాయవాది పెద్దబోయిన రాంనర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి

ముదిగొండ: ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలని మండలంలోని పండ్రేగుపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మంగళవారం ముదిగొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. జాబితాలో అర్హుల పేర్లను తొలగించినందున అధికారులు మరోమారు పరిశీలించి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ శ్రీధర్‌స్వామికి వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్‌లు పాము శిల్వరాజు, ఓ.అమరయ్య, నాయకులు బంకా మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆందోళనకు దిగిన పండ్రేగుపల్లి గ్రామస్తులు

గ్రామగ్రామాన కమిటీలు వేయాలి

తల్లాడ: అన్ని గ్రామాల్లో కమిటీలను ఏర్పాటుచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈ.వీ.రమేష్ సూచించారు. తల్లాడలో మంగళవారం చల్లా నాగులు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా బీజేపీని బలోపేతం చేయాలని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు గాదె కృష్ణారావు, వజ్రాల వేమారెడ్డి, తేజావత్ బాలాజీనాయక్, రాయల రమేష్, గొల్లమందల నరేష్, పులి వెంకటేశ్వర్లు, మల్లీదు వెంకటయ్య, వేము అశోక్, సాయిచంద్, నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

సత్తుపల్లి: సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచడమే కాక వైద్య సదుపాయాలు మెరుగుపర్చాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ.శరత్ కోరారు. సత్తుపల్లిలోని సమంత క్యాంపులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట చేపడుతున్న దీక్ష, ధర్నాకు తరలిరావాలని కోరారు. ఈసమావేశంలో మధు, రవి, వెంకటేష్, ప్రసాద్, సురేష్, వినోద్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే టోర్నీలో పతకాలు

కల్లూరురూరల్: మండలంలోని యజ్ఞ నారాయణపురానికి చెందిన రావి కృష్ణ – మంజూష కుమార్తె గగన హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన కరాటే పోటీల్లో పతకాలు సాధించింది. రాష్ట్ర స్థాయి టోర్నీలో మూడు, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించింది. హైదరాబాద్‌లో నాలుగో తరగతి చదువుతున్న గగనను మాజీ సర్పంచ్ రావి సూర్యనారాయణ, గ్రామస్తులు అభినందించారు.



సాధించిన పతకాలతో గగన

ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ

బోనకల్: బోనకల్ ఎస్సైగా పొదిలి వెంకన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా ఉన్న మధుబాబును హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేసి ఖమ్మం ట్రాఫిక్ ఎస్సైగా ఉన్న వెంకన్నను నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించాక మాట్లాడారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అలాగే, ఇసుక, మట్టి దందాలు సంపూర్ణంగా అరికడతానని వెల్లడించారు.



పొదిలి వెంకన్న

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు

కల్లూరు మండలం చిన్న కోరుకొండి గ్రామంలో తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. దీంతో పలు ప్రాంతాలకు సరఫరా జరగడం లేదు. ఇంకొన్నిచోట్ల లీకేజీలతో అంతరాయం ఏర్పడుతోంది. ఈమేరకు స్థానికుల ఫిర్యాదుతో ఉద్యోగులు మంగళవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు.

– కల్లూరురూరల్



మరమ్మతు చేస్తున్న సిబ్బంది